ఇరుకు.. ఇబ్బందులు

ఒకే భవనంలో అంగన్‌వాడీ, బస్తీ దవాఖాన

- ఆవరణలో మట్టికుప్పలు, చెత్త చెదారం
- కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపనతో సరి..

హఫీజ్‌పేట్: బస్తీ ప్రజలకు చేరువలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారు. ఐతే ఒకే భవనంలో రెండు కేంద్రాలు నిర్వహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో బస్తీ దవాఖాన ఏర్పాటు చేశారు. అయితే దవాఖాన ,అంగన్‌వాడీ కేంద్రం రెండూ ఒకే భవనంలో నిర్వహిస్తుండడంతో ఇరుకుగా మారింది. ఇక భవనం చుట్టు చెత్త చెదారంతో పాటు మట్టి పోస్తున్నారు. మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. బస్తీ దవాఖానలో రోగులకు కావలసిన కనీస వసతులు కల్పించలేదు. మంచినీటి సమస్య, పారిశుధ్యంపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి కనీస వసతులు కల్పించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- బస్తీ దవాఖాన భవనంలో ఇష్టానుసారంగా చెత్త చెదారం వేస్తున్నారు.
- దవాఖానా ప్రధాన గేటు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తుప్పుపట్టి ప్రమాదకరంగా ఉంది.
- వర్షాకాలంలో వరదనీరు భవనం ఆవరణలోకి వచ్చి చేరుతున్నాయి.
- కమ్యూనిటీ హాల్‌కు రూ.20 లక్షల నిధులతో గత సంవత్సరం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు.
- ప్రతి రోజు బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రంను శుభ్రం చేయాలి
- భవనానికి మంచినీటి బోరుతో పాటు మంజీరా నీటి కనెక్షన్ ఇవ్వాలి
- రాత్రి సమయాలలో భవనం ఆవరణలో అసంఘటిత కార్యక్రమాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.


ఇందిరానగర్ బస్తీలో బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ




ఆవరణలో చెత్త, మట్టి కుప్పలు


దవాఖానా పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చెత్త, మట్టి పోయకుండా చర్యలు తీసుకోవాలి



బస్తీ దవాఖానా, అంగన్వాడీ కేంద్రం ఆవరణంలో చెత్త చెదారంతో పాటు మట్టి పోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. దవాఖాన చుట్టు పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి. రాత్రి సమయాలలో అసంఘటిత కార్యక్రమాలు జరగకుండా చూడాలి.

– సాయి, ఇందిరానగర్ బస్తీ

కమ్యూనిటీహాల్ పనులు ప్రారంభించాలి



ఇందిరానగర్‌లో సుమారు రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ కొరకు గత సంవత్సరం అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– సంతోష్, ఇందిరానగర్ బస్తీ

అంతరాయం లేకుండా నీటి సరఫరా చేయాలి

ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ జలమండలి అధికారులకు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడా అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ధ్యేయంగా జలమండలి పనిచేయాలని సూచించారు. కాలనీలు, బస్తీలలో ప్రజలు ఇబ్బందులు పడకూడదని, కొన్ని కాలనీలలో తక్కువ ప్రెషర్, కొన్ని చోట్ల నాలుగు రోజులు గడిచినా నీరు వదలడం లేదని, సరిపడా మంచినీరు రావడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని పేర్కొన్నారు. మంచినీటి సరఫరాపై ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు.

ఆర్థికసాయం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధి ధరణినగర్‌లో నివసించే పాస్టర్ నాగభూషణం భార్య చంద్రకుమారి వైద్య చికిత్సకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం 5 వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, సిహెచ్. భాస్కర్, యాదగిరి, అగ్రవాసు, సంగమేష్, నారాయణ, ప్రశాంత్, నాగభూషణం, రాజు తదితరులు పాల్గొన్నారు.

భృంగీశ్వర వాహనంపై వీరభద్రుడు



జిన్నారం(పటాన్‌చెరు): వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి భృంగీశ్వర వాహనంపై వీరభద్రున్ని ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా ఈట శశిధర్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్యల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ కోరారు.

వ్యాసరచన పోటీలు

జిన్నారం(పటాన్‌చెరు): ఎర్త్‌డే సందర్భంగా ఆరు నుంచి 12వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు స్కోప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఉప్పలయ్య తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలను ఉప్పలయ్య వెల్లడించారు. ఈనెల 22న ఎర్త్ డే సందర్భంగా విద్యార్థులకు 'భూమండలాన్ని ప్లాస్టిక్ రహితం చేసేందుకు ఏం చేయాలి' (ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్)అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తమ వ్యాసానికి నగదు బహుమతి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్: 9849455481లో సంప్రదించాలని సూచించారు.

ఓటు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి

జిన్నారం (పటాన్‌చెరు): పద్దెనిమిది ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని గుమ్మడిదల ఎంపీడీఓ ఉమాదేవి సూచించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవటంతో పాటు నూతన ఓటు నమోదుకు తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్‌లకు బుధవారం గుమ్మడిదలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ ఉమాదేవి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


ఖాజీపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ మండల అధ్యక్షులు జగన్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, గడ్డపోతారం గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా బుధవారం ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న జగన్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సతీష్, రాజుగౌడ్, సీతారాజు, నవీన్, పద్మారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట, గుమ్మడిదల, నల్లవల్లి గ్రామాల్లో ఎంపీడీఓ ఉమాదేవి బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీధిలైట్లు పగలూ వెలుగుతున్నాయ్.. !



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో స్ట్రీట్ లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా లైట్లు వెలుగుతున్నా సదరు విభాగం అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో హిమసాయి లేక్ వ్యూ నుంచి వికాస్ ఎపిస్టిమో స్కూల్ చౌరస్తా వరకు ఉన్న రోడ్డులో ఇరువైపులా స్ట్రీట్ లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి వ్యాపారాన్ని అరికట్టండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న నీటి వ్యాపారాన్ని అరికట్టాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ గారి రమణ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలుచోట్ల నీటి వ్యాపారం జరుగుతుందని, అక్రమంగా ట్యాంకుల ద్వారా నీటిని తరలిస్తున్నారని తెలిపారు. దీనిని పూర్తిస్థాయిలో అధికారులు నియంత్రించి ప్రజలకు సరిపడా నీరు సరఫరా చేయాలని కోరారు.

రవీంద్రభారతి స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



లక్డీకాపూల్: మాదాపూర్‌లోని రవీంద్రభారతి ప్రీ స్కూల్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులు సందడి చేశారు. బుధవారం జరిగిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు పట్టాలు అందుకున్నారు. కార్యక్రమంలో అతిథులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన ఎస్‌ఐ, హెచ్‌సీకి రివార్డులు


ఎస్ఐ సాయినాథ్‌కు రివార్డు అందిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్


హెడ్ కానిస్టేబుల్ రాంచంద్రయ్యకు..

గచ్చిబౌలి: డ్రై గంజాయిని పట్టుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్‌కు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ రివార్డులను అందించారు. గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో సబ్ ఇన్‌స్పెక్టర్ బి సాయినాథ్, హెడ్ కానిస్టేబుల్ రాంచంద్రయ్యలను ఆయన అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపారని మెచ్చుకున్నారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక


విందులో పాల్గొన్న షబ్బీర్ అలీ, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, జెరిపేటి జైపాల్


విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

హఫీజ్‌పేట్: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ శాఖల ప్రధాన సలహాదారులు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం న్యూ హఫీజ్‌పేట్‌లోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి.రంజిత్‌రెడ్డిలతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం గంగా జమున తహజీబ్‌కు వేదికగా నిలిచిందన్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

తారానగర్‌లో

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హబీబ్ ఆధ్వర్యంలో దావత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, పార్టీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అన్వర్ షరీఫ్, అహ్మద్, నటరాజ్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు

- ఆర్టీసీ కార్గో ద్వారా పంపించేందుకు ఏర్పాట్లు
- ఈనెల 17వ తేదీ వరకు బుక్ చేసుకోవడానికి అవకాశం

రాయదుర్గం: భద్రాచలం సీతారాముల తలంబ్రాలను ప్రజలకు అందించేందుకు ఆర్టీసీ కార్గో ద్వారా ఏర్పాట్లు చేసినట్లు గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆర్టీసీ కార్గో సేవల లాజిస్టిక్ కౌంటర్ల ద్వారా ఇంటింటికి పంపించే ఏర్పాట్లు చేసినట్లు ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ సహకారంతో సీతారాముల తలంబ్రాలు హోమ్ డెలివరీ చేసే కార్యక్రమాన్ని టీఎస్ ఆర్టీసీ శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు. ఈనెల 17వ తేదీ వరకు టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్లలో రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు.. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పట్లోళ్ళ విజేందర్‌రెడ్డి 9652267204, 9849567204లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

జెరిపేటి జైపాల్‌ను సత్కరించిన రంజిత్‌రెడ్డి



హఫీజ్‌పేట్: రాష్ట్ర ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, జెరిపేటి రాంచందర్ రాజులను చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జి.రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్‌లు బుధవారం చందానగర్‌లోని ఆయన నివాసంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ కంటెస్టెడ్ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స



మాదాపూర్: మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసి రోగి ప్రాణాలను కాపాడారు. బుధవారం విలేకరుల సమావేశంలో డాక్టర్ పవన్ మాట్లాడుతూ అతి తక్కువ కోతతో ఊపిరితిత్తులలో ఉన్న క్యాన్సర్ కణితిని తొలగించినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన రావు(65) దగ్గు, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతూ మెడికవర్ ఆసుపత్రికి రాగా స్కానింగ్‌లో ఊపిరితిత్తుల క్యాన్సర్ కణితి ఉందని తెలుసుకుని మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ద్వారా కణితిని తొలగించినట్లు తెలిపారు. ఈ సర్జరీ ద్వారా ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ తగ్గుతుందని, ఎక్కువ రోజులు వెంటిలేషన్ అవసరం ఉండదని, రోగు త్వరగా కోలుకుంటాడని తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం


డ్రైనేజీ పనులను చేయిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని గౌతంనగర్ కాలనీలోని మసీదు వద్ద మురుగునీరు రోడ్డు పైకి రావడంతో స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ డ్రైనేజీని క్లీన్ చేయించారు. అనంతరం జెపి కాలనీ రోడ్ నంబర్ 5లో డ్రైనేజీ పైపు పగలడంతో మురుగునీరు రోడ్ల పై ప్రవహిస్తూ కాలనీ కాలనీవాసులు ఇబ్బందులు పడుతుండటంలో పగిలిన పైప్‌లైన్ వద్ద నూతన పైప్‌లైన్ వేయించారు.

ఆకట్టుకుంటున్న వస్త్రప్రదర్శన



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్ మగువల మనసు దోచుకుంటోంది. రంగురంగుల కాటన్, సిల్క్, డిజైనరీ చీరలు అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పటోలా, చందేరి, బెనారస్, కోల్‌కతాతో పాటు తెలుగురాష్ట్రాల పోచంపల్లి, ఉప్పాడ, ధర్మవరం చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సుమారు 80స్టాల్స్ ఏర్పాటు చేశామని, ఈనెల 7వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి శ్రీరామ కర్ణామృతం

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారద శంకర మఠంలో వాగ్దేవి వరపుత్ర, ప్రవచన విరించి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మచే శ్రీరామ కర్ణామృతం ప్రవచనం ఉంటుంది. 4 నుంచి 6వ తేదీ వరకు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ,కార్పొరేటర్ శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, కార్పొరేటర్ వేరే పార్టీలోకి పోయినంత మాత్రాన ఒరిగేది ఏమీ లేదన్నారు. ఆయన స్వార్థం, స్వలాభం కోసమే పార్టీ మారాడు తప్ప మరోకటి లేదన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. సర్వే నెంబర్ 336 ప్రభుత్వ భూమిలో జరుగుతున్న కబ్జాలపై కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రూ.50 వేలు దాటితే పత్రాలు తప్పనిసరి..


కిష్టారెడ్డిపేటలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న బృందం

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమించిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట రహదారిపై బుధవారం తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్-2 అధికారి హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నిబంధన మేరకు రూ.50 వేల కంటే డబ్బు ఎక్కువ రవాణా చేస్తే తప్పనిసరిగా నగదుకు సంబంధించిన రసీదు ఉండాలన్నారు.నగదుకు సంబంధించిన పత్రాలు లేకుంటే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ అసిస్టెంట్ అధికారి సుభాష్, పోలీసులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటామని మైక్రోబ్యాక్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు,మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ పరిధిలో ఉన్న మైక్రోబ్యాక్స్ పరిశ్రమలోని కార్మికులకు ప్రస్తుతం ఉన్న వేతనంపై అదనంగా 3 సంవత్సరాలకు గాను ఇంక్రిమెంట్ రూ.9 వేలు పెంచాలంటూ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి నూతన వేతన ఒప్పందం కుదిరించారు. కార్యక్రమంలో మైక్రోబ్యాక్స్ పరిశ్రమ జనరల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివలింగం, ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఈసీ మెంబర్స్ వేంకటేశం, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డీసీఎల్‌కు నూతన వేతన ఒప్పంద పత్రాలను అందజేస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు,పరిశ్రమ నిర్వాహకులు